క్లుప్తంగా

ఎమ్మెల్యే కన్నబాబుకు కృతజ్ఞతలు



దోర్ నంబర్ ప్రతిని ఎమ్మెల్యే కన్నబాబుకు చూపిస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్న ముస్లింలు

కాకినాడ రూరల్: రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 172/1లో నూర్ బాషా వెల్ఫేర్ అండ్ ముస్లిం ధార్మిక కార్యకలాపాల సంఘం షెడ్‌లోని మసీదుకు డోర్ నంబరు ధ్రువీకరణకు సహకరించడంపై ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం కన్నబాబును నూర్ బాషా ముస్లింలు కలిశారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ కరీం బాషా మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నబాబు ముస్లింలకు అండగా ఉంటున్నారని, ఆయనకు మద్దతుగా ఉంటామన్నారు

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): బీజేపీ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడిగా చిట్నీడి శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయనకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు నుంచి సోమవారం నియామక పత్రం అందింది. గతంలో చిట్నీడి శ్రీనివాస్ కాకినాడ నగర అధ్యక్షుడిగా, జిల్లా ఎంఎస్ఎంఈ కన్వీనర్‌గా, జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. కాకినాడ నగర అధ్యక్షుడిగా పనిచేసిన సమయంలో గత టీడీపీ ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేసిన తనను గుర్తించి ఈ పదవి ఇచ్చారని ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ పటిష్టానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

నేడు 'ఏజెంట్' ప్రీ రిలీజ్



ఏజెంట్ సినిమా ప్రీ రిలీజ్ గురించి వివరిస్తున్న దేవరపల్లి శివరామ్ తదితరులు

కాకినాడ కల్చరల్: సినీ నటుడు అక్కినేని నాగార్జున తనయుడు అఖిల్ హీరోగా నటించిన 'ఏజెంట్' సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమం మంగళవారం సాయంత్రం కాకినాడలోని మెక్లారిన్ పాఠశాల గ్రౌండ్‌లో జరుగనుంది. దీనిపై సోమవారం స్థానిక మెక్లారిన్ పాఠశాల ఆవరణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్, వింటేజ్ క్రియేషన్స్ అధినేత దేవరపల్లి శివరామ్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీనటుడు అఖిల్ వచ్చి సందడి చేస్తారన్నారు. కాకినాడలో తొలిసారిగా ప్రీ రిలీజ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వింటేజ్ క్రియేషన్స్ మేనేజర్ కర్రి మోహన్, ప్రతినిధి బెనర్జీ, ప్రకాష్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

కాశీ పాదయాత్రికులకు సత్కారం



భక్తులను సన్మానించిన ఇన్‌చార్జి కమాండెంట్ భద్రయ్య, దక్షణామూర్తి తదితరులు

కాకినాడ రూరల్: కాకినాడ, పరిసర ప్రాంతాల నుంచి కాశీ, అయోధ్య తదితర పుణ్య క్షేత్రాలను పాదయాత్ర ద్వారా దర్శించుకున్న భక్తులను సీతారామాంజనేయ నాట్య మండలి, ఏపీఎస్పీ ఆలయ సముదాయం అధ్యక్షుడు అన్నెపు దక్షణామూర్తి ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. రమణయ్యపేటలో ఏపీఎస్పీ ఎదురుగా రామాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జి కమాండెంట్ సీహెచ్ భద్రయ్య, అసిస్టెంట్ కమాండెంట్ సత్యం ముఖ్య అతిథులుగా హాజరై ఇటీవల కాశీ పాదయాత్రలో పాల్గొన్న గళ్ల సుబ్బారావు, బుర్రా వీరభద్రరావు, ముమ్మిడి కొండబాబు, ఆంజనేయులను సన్మానించారు. ఈ సందర్భంగా భద్రయ్య మాట్లాడుతూ కాశీ, అయోధ్య వంటి ప్రముఖ పుణ్య క్షేత్రాలను దర్శించుకునేందుకు పాదయాత్రగా వెళ్లి రావడం పూర్వజన్మ సుకృతమన్నారు.

టీడీపీ ప్రచారం

కరప: పెద్దాపురప్పాడులో సోమవారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకె శ్రీనివాస్‌బాబా ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ, మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు వాసిరెడ్డి చిట్టిబాబు, ఎస్.ఏడుకొండలు, పోలినాటి శ్రీనివాసరావు, ఎ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి ప్రతాపం



నిర్మానుష్యంగా కరపలో ప్రధాన రహదారి

కరప: వారం రోజులుగా ఎండ దంచేస్తోంది. ఉదయ భానుడు ఉగ్రరూపం దాల్చుతున్నాడు. సామాన్యులను విలవిలలాడిస్తున్నాడు. కరప మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం 42 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8 గంటల నుంచే 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడంతో బయటకు వెళ్లాలంటేనే ప్రజలు భయపడ్డారు. ఎండకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. వ్యాపారస్తులు మధ్యాహ్నం 12 గంటలకే దుకాణాలు బంద్ చేసి, ఇళ్లకే పరిమితమయ్యారు. ఇప్పుడే ఎండ తీవ్రత ఇలా ఉంటే మే నెలలో వచ్చే రోహిణీ కార్తెలో ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సాయంత్రం 5 గంటలకు కూడా సూర్యుడి భగభగలు తగ్గలేదు.

మధ్యాహ్నం.. బిందెడు కష్టం



కొంగోడు ఎస్సీ వీధిలో మధ్యాహ్న వీధి కుళాయి నుంచి నీరు పట్టుకుంటున్న స్థానికులు

కరప: మిట్ట మధ్యాహ్నం.. ఆపై సుర్రుమంటున్న ఎండ.. అప్పుడే కుళాయిల నుంచి నీరొస్తే పట్టుకోవాలంటే ఆపసోపాలే. సరిగ్గా కొంగోడులో వీధి కుళాయిల పరిస్థితి అలాగే ఉంది. ఎస్సీ వీధిలో అయితే ఒక్కొక్కరు ఒక బిందె కూడా పట్టుకోలేక పోతున్నామని ప్రజలు అంటున్నారు. గొల్లపాలెం సామూహిక రక్షిత మంచినీటి పథకం నుంచి కొంగోడుకు పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఒక్కోసారి మధ్యాహ్నం 11 గంటలకు, లేదంటే 12 గంటలకు కుళాయిలు వదులుతున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న సమయంలో మంచినీటిని పట్టుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు అంటున్నారు. అధికారులు స్పందించి ఉదయం లేక సాయంత్రం వేళల్లో రెండు గంటల పాటు వీధి కుళాయిల ద్వారా నీరు అందించాలని కోరుతున్నారు.

కొమ్మకొమ్మకూ మధురమోయి..



పెదకొత్తూరులో మామిడి చెట్టుకు విరగకాసిన కాయలు

కరప: వేసవి వచ్చిందంటే.. మామిడి సీజన్ మొదలైనట్టే. ఈ మధుర ఫలం అంటే ఇష్టపడని వారుండరు. అలాంటి మామిడి చెట్టు పెదకొత్తూరులో విరగకాసింది. కాలువ గట్టున ఉన్న ఈ బంగినపల్లి రకం చెట్టు కొమ్మ కొమ్మకూ మామిడికాయలు కాశాయి. అవి గుత్తులు గుత్తులుగా వేలాడుతూ అందరినీ ఆకర్షిస్తున్నాయి. ఈ మామిడిచెట్టు కాయలు పెద్దవిగా ఉండేవని, ఈ ఏడాది ఎక్కువగా కాయడంతో సైజు పెరగలేదని ఆ గ్రామ మాజీ సర్పంచ్ చింతా ఈశ్వరరావు వివరించారు.

వ్యర్థం... సరికొత్త అర్థం

- తడి చెత్త నుంచి సీఎన్‌జీ గ్యాస్ ఉత్పత్తి
- కాకినాడలో బయోమెథనేషన్ ప్లాంట్
- 6.45 ఎకరాల స్థలం కేటాయింపు

కాకినాడ: 'చెత్త' నుంచి సంపద సృష్టించేందుకు నగరపాలక సంస్థ మరో అడుగు ముందుకు వేసింది. ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా తడి చెత్త నుంచి గ్యాస్ ఉత్పత్తి చేసే దిశగా ప్రతిపాదనలు చేసింది. దీనికి గాను రూ.12 కోట్లతో బయోమెథనేషన్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. కాకినాడ నగరపాలక సంస్థ పర్యవేక్షణలో స్మార్ట్ సిటీ ద్వారా చొల్లంగి గ్రామంలో 6.45 ఎకరాల విస్తీర్ణంలో బయోమెథనేషన్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని సంకల్పించింది. దీనికి సంబంధించి హెచ్‌ఆర్ స్క్వేర్ ఎల్ఎల్‌పీ సంస్థ ఇప్పటికే ముందుకు వచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా నడుస్తోన్న సదరు కంపెనీ స్మార్ట్ సిటీతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. అతి త్వరలోనే చెత్త నుంచి గ్యాస్ తయారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టనుంది.

రూ.12 కోట్లతో ప్రాజెక్టుకు రూపకల్పన

పూర్తిగా తడి చెత్తను ఉపయోగించి సీఎన్‌జీ (కంప్రెస్ట్ నేచురల్ గ్యాస్)ను తయారు చేయనున్నారు. మొత్తం ప్రాజెక్టు విలువ రూ.12 కోట్లుగా తేల్చారు. రోజుకు 40 టన్నుల సామర్థ్యం కలిగిన చెత్తను చొల్లంగి వద్ద ఏర్పాటు చేసే ప్లాంట్‌లో ప్రోసెసింగ్ చేయనున్నారు. ప్లాంట్ ప్రారంభించి గ్యాస్ ఉత్పత్తి చేసే ప్రక్రియ పూర్తి స్థాయిలో అమలు అయ్యేందుకు కనీసం 9 నుంచి 12 నెలల వ్యవధి పడుతుందని అంచనా వేస్తున్నారు. ఆ తరువాత 40 మెట్రిక్ టన్నుల తడి చెత్త నుంచి రోజుకి 800 కిలోల సీఎన్‌జీ గ్యాస్ ఉత్పత్తి చేయనున్నారు.



చొల్లంగిలో బయోమెథనేషన్ ప్లాంట్ కోసం కేటాయించిన స్థలం

ఇరవై ఏళ్లు నిర్వహించేలా...

కొత్తగా ఏర్పాటయ్యే బయోమెథనేషన్ ప్లాంట్‌ను సుమారు 20 ఏళ్ల పాటు నిర్వహించేలా సదరు సంస్థ ఒప్పందం చేసుకుంది. ఆ తరువాత నిర్వహణ సామర్థ్యంతోనే తిరిగి నగరపాలక సంస్థకు అప్పగిస్తోంది. కేవలం స్థలం మాత్రమే ప్రభుత్వం తరఫున కేటాయిస్తారు. అవసరమైన రూ.12 కోట్ల పెట్టుబడిని సదరు సంస్థే భరిస్తోంది. అయితే కార్పొరేషన్ నుంచి రోజూ అందించే తడి చెత్తను నేరుగా ప్లాంట్ వద్దకే అప్పగించడంతో పాటు, తొలి ఏడేళ్లు కిలోకు రూపాయి చొప్పున కార్పొరేషన్ లేదా స్మార్ట్ సిటీ నుంచి ప్రైవేట్ సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. 8వ ఏట నుంచి 20వ సంవత్సరం వరకూ కిలోకు అర్ధరూపాయి మాత్రమే చెల్లించడంతో పాటు ప్రాజెక్టులో వచ్చే లాభాల నుంచి 20 శాతాన్ని వెనక్కి ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు.



బయోమెథనేషన్ ప్లాంట్ నిమిత్తం మట్టి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తడి చెత్తే కీలకం

బయోమెథనేషన్ ప్లాంట్ సమర్థ నిర్వహణకు తడి చెత్తే కీలకం కాబోతోంది. ప్రజల నుంచి వేర్వేరుగా సేకరిస్తున్న తడి- పొడి చెత్త విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి తడి చెత్తను రోజూ బయోమెథనేషన్ ప్లాంట్‌కు తరలించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియలో నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం పాత్ర మరింత కీలకం కానుంది. ప్రాజెక్టు సక్సెస్ కావాలంటే రోజూ 40 టన్నుల చెత్త అవసరమైన పరిస్థితుల్లో ప్రజారోగ్య విభాగం మరింత ప్రణాళికా బద్ధంగా చెత్త సేకరణపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

త్వరలోనే ప్లాంట్ పనులు



బయోమెథనేషన్ ప్లాంట్ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే 6.5 ఎకరాల స్థలాన్ని కేటాయించాం. కాంట్రాక్టు పొందిన ప్రైవేట్ సంస్థ కూడా కార్యకలాపాలను ప్రారంభించే ప్రక్రియను వేగవంతం చేసింది. నగరపాలక సంస్థ కమిషనర్, స్మార్ట్‌సిటీ ఎండీ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తాం. పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

–ఎం.వెంకట్రావు, ఎస్ఈ, స్మార్ట్ సిటీ

విలీనం ఆపాలి

కాకినాడ సిటీ: రైతు భరోసా కేంద్రాలను వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో విలీనం చేయడాన్ని ఆపాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగుల సంఘం సోమవారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించింది. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేశారు. సహకార పరపతి సంఘం ఉద్యోగులు పి.తంబయ్య, అప్పలరాజు, కోలంక రాము, సత్యానందం, చిట్టియ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్రయంబకేశ్వరుని కల్యాణం



రమణయ్యపేటలో త్రయంబకేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలోని శివాలయంలో పార్వతీ సమేత త్రయంబకేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం సోమవారం రాత్రి జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివాలయ అర్చకుడు ఘంటసాల శ్రీసాయి చైతన్యశర్మ అర్చకత్వంలో ఈ వేడుక నిర్వహించారు. ఆర్టీసీ కాలనీకి చెందిన ఆకుల రాజబాబు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ చైర్మన్ నందిబాబు, వేణు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ హయాంలోనే రాష్ట్ర ప్రగతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి, పార్టీ నగరాధ్యక్షురాలు శివప్రసన్న

జగనన్నే మా భవిష్యత్తులో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక రేచర్లపేటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. పార్టీ రూపొందించిన ప్రశ్నావళిని ప్రజల ముందు ఉంచి సమాధానాలు తెలుసుకున్నారు. జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లను యజమానుల అంగీకారంతో ఇళ్లకు అతికించే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తులో భాగంగా ప్రజల వద్దకు వెళ్లినప్పుడు మంచి స్పందన కనిపిస్తోందన్నారు. ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీఎం జగన్ పాలనలో అందుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఇటువంటి ముఖ్యమంత్రి మరోసారి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలను నిలువునా దగా చేస్తే, సీఎం జగన్ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేశారన్నారు. జగన్ పాలనలో అమలు చేస్తున్న పాలనా సంస్కరణలు దేశంలోని ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రేచర్లపేట ప్రాంతానికి చెందిన స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

డ్వాక్రా యానిమేటర్ల ధర్నా

కాకినాడ సిటీ: డ్వాక్రా యానిమేటర్ల (వీవోఏ) సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక పీడీ కార్యాలయం వద్ద సోమవారం వీవోఏల సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. సీఐటీయూ ఆల్ ఇండియా ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి మాట్లాడుతూ కాజులూరు, కాకినాడ రూరల్ మండలాల్లో తొలగించిన వీవోఏలను విధుల్లోకి తీసుకోవాలన్నారు. కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, యూనిఫాం, అలవెన్స్ ప్రభుత్వం ఇవ్వాలని అన్నారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణికి వినతి పత్రం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి 'స్పందన'



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కారానికి 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు ఫిర్యాదులు స్వీకరించారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలకు సంబంధించి తొమ్మిది అర్జీలు అందాయి. అక్రమ కట్టడం, పన్నుల సమస్యలు, రోడ్డుపై అవరోధంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని మార్పు చేయడం వంటి అంశాలపై ప్రజలు అర్జీలు అందజేశారు. ఆయా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశిస్తూ ఆయన సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా నాగ నరసింహారావు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. ఆర్థికపరమైన సమస్యలు, న్యాయవివాదంలో ఉన్న అంశాలు మినహా ప్రతి ఒక్క అర్జీకి నిర్ణీత గడువులోగా పరిష్కారాన్ని అందిస్తామన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో ఫిర్యాదులు అందజేయవచ్చన్నారు. మేనేజర్ కర్రి సత్యనారాయణ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అడుగు పడితేనే ఆరోగ్యం

- వ్యాయామం, నడకకు ఆదరణ
- కిటకిటలాడుతున్న మైదానాలు



కాకినాడ బోట్‌క్లబ్ పార్కులో నడక బాట పట్టిన వాకర్స్

బోట్‌క్లబ్: ఆరోగ్యమే మహాభాగ్యం అంటుంటారు పెద్దలు.. అలాంటి ఆరోగ్యానికి మనం వేసే 'అడుగు' చక్కని ఔషధం.. గుండె నొప్పి నుంచి రక్తపోటు వరకూ, మధుమేహం నుంచి మానసిక సమస్య వరకూ ఏ సమస్య నివారణకు అయినా వినిపించే ఒకేఒక మంత్రం వ్యాయామం. ప్రస్తుత సమాజంలో ఆరోగ్య స్పృహ పెరుగుతోంది. ఇందుకు యోగా, నడక, వ్యాయామానికి ఆదరణ లభిస్తుంది. చిన్నారుల నుంచి యువకులు, పెద్దలు, ఇలా అన్ని వయస్కులూ నగరంలోని బోట్‌క్లబ్ పార్కు, ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని జిల్లా క్రీడా మైదానం, రాజా ట్యాంక్‌తో పాటు పలు వాకింగ్ ట్రాక్‌లో నడక సాగిస్తున్నారు. తెల్లవారు జాము 4 గంటల నుంచి ఉదయం ఏడు గంటల వరకూ వాకింగ్ ట్రాక్‌లు వారిలో కిటకిటలాడుతున్నాయి. ఉదయం కుదరని వారు సాయంత్రం వాకింగ్ చేస్తున్నారు. చాలా మందికి ఉదయం లేవడం బద్ధకంగా ఉంటుంది. అలాంటప్పుడు బద్ధకాన్ని వదిలించుకుని వ్యాయామానికి ఉపక్రమిస్తే రోజంతా ఉత్సాహంగా ఉంటారు. జీవన ప్రక్రియలో క్రమబద్ధీకరణ అలవాటు అవుతుంది. గుండె సంబంధిత రోగులు ఏటేటా పెరుగుతున్నారు. ఇలాంటి తరుణంలో అందరికీ వ్యాయామం తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక దారుఢ్యానికి తప్పనిసరిగా వ్యాయామం చేయాలి. అలాగే పోలీస్, నేవీ, ఆర్మీ, రైల్వే, ఎక్సైజ్ తదితర ఉద్యోగాల సాధనలో పరుగుతో పాటు శారీరక ధృడత్వానికి ఇది దోహదపడుతుంది. వ్యాయామం క్రమం తప్పకుండా చేస్తే ఎంత మంచిదో, మధ్యలో మానేయడంతో అన్నే అనర్థాలు ఉంటాయి. వ్యాయామం చేసి మానేయడం వల్ల స్థూలకాయం వంటి జబ్బులు వచ్చే ప్రమాదం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

మధ్యలో మానేయరాదు



వ్యాయామం చేసి మధ్యలో మానేయడం వల్ల ఇబ్బందులు వస్తాయి. రోజూ గంట వ్యాయామం చేస్తే మంచిది. ప్రస్తుత ఎండాకాలంలో చెమట రూపంలో నీరు బయటకు వస్తుంది. మనశక్తి మేరకు వ్యాయామం చేయాలి. స్థూలకాయం ఉన్నవారు ఎక్కువ సేపు వ్యాయామం చేస్తే ఇబ్బందులు వస్తాయి.

–అద్దాల సత్యనారాయణ, వైద్యుడు

క్రమం తప్పకుండా వ్యాయామం



కొన్నేళ్లుగా ప్రతి రోజూ ఉదయం గంట పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నాను. శారీరక వ్యాయామం వల్ల రోగాలకు దూరంగా ఉంటున్నాను. అలాగే రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. ఉదయం కుదరకుంటే సాయంత్రమైనా వ్యాయామం తప్పకుండా చేస్తాను.

–జి.భానోజీరావు

గ్రాడ్యుయేషన్ డే.. మరుపురాని జ్ఞాపకం



గ్రాడ్యుయేషన్ పట్టాలను అందుకున్న విద్యార్థులతో డాక్టర్ నయన

నాగమల్లితోట జంక్షన్: విద్యార్థి జీవితంలో ప్రైమరీ స్కూల్ స్థాయిలో జరిగే గ్రాడ్యుయేషన్ డే ఓ మరుపురాని జ్ఞాపకమని ప్రముఖ ఈఎన్‌టీ వైద్యురాలు నయన అన్నారు. సోమవారం స్థానిక రామారావు పేటలోని నారాయణ స్కూల్‌లో ఈ-కిడ్స్, ఈ చాంప్స్ విద్యార్థులు ప్రాథమిక విద్యను పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించి పట్టాలు అందజేశారు. దీనికి ముఖ్య అతిథులుగా డాక్టర్ నయన, స్కూల్ ఏజీఎం రాఘవేంద్రరావు, ఈ-కిడ్స్ జోనల్ కోఆర్డినేటర్ సపూరా, ఈ-చాంప్స్ జోనల్ కోఆర్డినేటర్ తులసి హాజరయ్యారు. అకడమిక్‌లో విశేష ప్రతిభ చూపిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం చిన్నారుల నృత్యాలు ఆహూతులను అలరించాయి. స్కూల్ ప్రిన్సిపాల్ షర్మిల, సాఫ్ట్‌స్కిల్క్ ట్రైనర్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు



కలెక్టర్ కృతికా శుక్లాను కలసి కృతజ్ఞతలు తెలుపుతున్న అభ్యర్థులు

కాకినాడ సిటీ: స్పందన కార్యక్రమంలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్న ఏడుగురు అభ్యర్థులకు ఖజానా జ్యూయలరీలో వివిధ ఉద్యోగాలు కల్పించారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు సోమవారం స్థానిక స్పందన కార్యక్రమంలో కలెక్టర్ కృతికా శుక్లాను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఖజానా జ్యూయలరీలో సీహెచ్ మంజుశ్రీ, ఎం.రాజేష్, పి.మణికంఠ, కె.సూర్యభవాని, పి.రాజేష్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగానికి నెలకు రూ. 15 వేల జీతంతో ఎంపిక కాగా, పి.నవ్యశ్రీ టైమ్ మేనేజ్‌మెంట్ ఉద్యోగానికి, ఎం.గణేష్ ఆఫీస్ అసిస్టెంట్‌గా నెలకు రూ.13,500 జీతంతో ఎంపికైనట్లు వికాస పీడీ కె.లచ్చారావు వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

- యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాకినాడ రీజినల్ హెడ్‌గా బాధ్యతలు స్వీకరించిన మనోహర్ కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాద పూర్వకంగా కలిశారు.

SUMMONS/NOTICE FOR SERVICE BY ADVERTISEMENT IN A NEWS PAPER
IN THE HON'BLE HIGH COURT FOR THE STATE OF ANDHRA PRADESH, AT AMARAVATHI
C.M.A. No. 90 of 2021

BETWEEN:
Veera Venkata Srinadh Raju and another ...Petitioners
AND
Medimella Prasad @ Dorababu and 9 others ...Respondents

To,
1. Koripella Suryakantham, W/o Late Koripella Venkataraju, R/o Machavaram
2. Koripella Ramchendar Rao, S/o Late Koripella Venkata Raju, R/o Machavaram
3. Garigipati Sri Devi, D/o Late Koripella Venkata Raju, R/o Kothuru, Ramachandrapuram
4. Chodi Manorama, D/o Late Koripella Venkata Raju, R/o Ippanapadu
5. Mullhyala Bharathi, D/o Late Koripella Venkata Raju, R/o Chelluru

WHEREAS the Petitioners herein i.e. Veera Venkata Srinadh Raju, S/o Venkata Satyanaryana Raju, R/o Kakinada has preferred the above appeal against certain Respondents. The Respondent No.2 in the above case who is Koripella Venkata Raju, S/o Satyanarayana Murthy, R/o Machavaram, Rayavaram Mandalam, Ramachandra- puram, A.P. died on 14-08-2020. Since you are the legal heirs of Mr. K. Venkata Raju, you are hereby summoned to appear in court in person or by the pleader in the above captioned case.

The Hon'ble Court was pleased to post the matter after Four (4) Weeks i.e. 10-05-2023. Therefore, you are hereby given notice as legal representatives of Late Koripella Venkata Raju to appear before the Hon'ble High Court of Andhra Pradesh on the next date of hearing at 10:30 AM to answer the same, failing which, the case would be disposed off exparte. Hence, this notice.

// By order of the Hon'ble court //
Vankina, Allu & Partners
(Advocates)
Flat No. 301, Plot No.450, K.K. Plaza, 100 Feet Road, Madhapur, Hi-Tech City, Hyderabad-500081. Ph:93905 98481
Hyderabad, Date: 18-04-2023